
# వసూలు



— జింబో

పదకొండు కావొస్తుంది. భూపాలరావు అప్పుడే ఆఫీస్‌కి వచ్చాడు. పోలీస్‌స్టేషన్‌ని ఆనుకొని అతని సర్కిల్ ఆఫీస్. ఆ ఆఫీస్ ఈ మధ్యే కట్టారు. అక్కడ లాకప్‌రూంలు వుండవు. అవి స్టేషన్లో వుంటాయి. లాకప్ రూంలోని మూలుగులు అక్కడికి వినరావడంలేదు. గాలికూడా జోరుగా వీయడంలేదు. వాతావరణం నిశ్శబ్దంగా వుంది. భూపాలరావు ఆ సర్కిల్‌కి వచ్చి సంవత్సరం దాటిపోయింది. భూపాలరావు కర్కశంగా ఏమీ వుండడు. మూతిమీద గుబురుమీసాలు తప్ప భయంకరంగా ఏమీ వుండడు. అత నంటే ఆ సర్కిల్‌కి అంతా హడల్. అతను జీపులో వెళ్తుంటే రోడ్డుమీద జనం నడవడానికి భయపడతారు. అతను ఇంటరాగేషన్ మొదలుపెట్టక ముందే దొంగసొత్తు నడుచుకుంటూ వస్తుంది. అతను ఆ సర్కిల్‌కి వచ్చిన తరువాత నాలుగు ఎన్‌కౌంటర్లూ, రెండు లాకప్‌డెత్‌లు తప్ప లాకప్ రేప్‌లు జరగలేదు. ఆ సర్కిల్ ఏరియాలో అతనికి భయపడని ప్రాణి లేదు. ఒక్క అతని డాబర్‌మాన్ కుక్కా, అతని భార్యా పిల్లలు తప్ప.

అతని ఆఫీస్ ఇంకా పైరవికారులతో నిండిపోలేదు. తన క్రింది ఉద్యోగులకి ఇవ్వాల్సిన ఆజ్ఞలు ఇచ్చిన తరువాత మిగతా వ్యవహారాలు చూస్తాడు. అందుకే పైరవికారులు అక్కడికి చేరుకోలేదు. దూరంగా చెట్ల క్రింద నిల్చొని వున్నారు. భూపాలరావు దగ్గరి నుంచి పిలుపుకోసం వేచి చూస్తున్నారు.

స్టేషన్ చుట్టూ కాంపౌండ్‌గోడ ఈమధ్యే కట్టారు. ఆ గోడల ఆ చుట్టుప్రక్కల కొత్తగా కట్టుకున్న ఇళ్ల వాళ్ళ ఇటుకలు, సిమెంట్లు, ఇంకా ఎందరివో కష్టాలూ, కన్నీళ్ళూ వున్నాయి. స్టేషన్ ముందు రెండువైపులా ఇసుక బస్తాలు, వాటి వెనక అదృశ్యంగా వున్న సెంట్రీలు. కాంపౌండ్‌లో అంతటా వేపచెట్లు. ఆ వేప చెట్ల క్రింద భయం భయంగా ఫిర్యాదుదారులు, హాయిగా నవ్వుతూ పైరవీకారులు వున్నారు. సర్కిల్ ఆఫీసుకి స్టేషన్‌కి మధ్య వున్న ఓ వేపచెట్టుక్రింద తిరుమలరావు నిల్చొని వున్నాడు. అతను దగ్గర్లో వున్న ఓ వూరి సర్పంచ్. నలభై అయిదు సంవత్సరాలుంటాయి. ఖద్దరు లాల్చీ ధోతీ అవి అతనిలాగే తెల్లగా కరుగ్గా వున్నాయి. అతనికి కాస్త దూరంలో రాములు నిల్చొని వున్నాడు. తల దగ్గర రక్తగాయమైంది. అతని శరీరం మీద వున్న ముతక బనీను కూడా కాస్త రక్తంతో తడిసి ఎండిపోయింది. అతను ఓ మామూలు రైతు. ముప్పై ఏళ్ళుంటాయి. తిరుమలరావుని నమ్ముకున్న వ్యక్తి.

ఆరోజు ఉదయం అతని భూమి దగ్గరికి ఎం.సీ. ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. అతనికీ అతని పాలివాడు పర్సయ్యకీ భూమి గెట్టు పంచాయతీ వుంది. పర్సయ్య కోరిక మీద ఎం.సీ వచ్చాడు భూమి కొలవడానికి పర్సయ్య తరఫున నారాయణ, రాములు తరఫున బాలయ్యలు సాక్షులుగా అక్కడికి వచ్చారు. నారాయణ ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాడు. పై చదువులు చదవకుండా తండ్రికి సహాయంగా వ్యవసాయం పనులు చేపట్టాడు. కొంత లోకజ్ఞానం వుంది. అన్యాయాన్ని ఎదిరించే మనస్తత్వమూ వుంది. దానివల్ల అతనికి కొంతమంది స్నేహితులూ, ఎక్కువమంది శత్రువులూ ఏర్పడ్డారు. ఆ శత్రువుల్లో ప్రధానమైనవాడు తిరుమలరావు.

వాళ్ళందరి సమక్షంలో ఎం.సీ భూమి కొలిచాడు. గెట్లు సరిచేశాడు. క్రొత్త హద్దు బందులు నాటాడు. రాములు స్వాధీనంలో పర్సయ్య భూమి వున్నట్టు కొలతల్లో తేలింది. ఆ జాగా వదులుకోవడానికి రాములుకి మనస్కరించలేదు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఇద్దరూ కలియబడ్డారు. వాళ్ళు గొడవపడకుండా నారాయణ చాలా ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం లేకపోయింది. వాళ్ళ త్రోసులాటలో నారాయణ కూడా క్రిందపడిపోయాడు. గాయాలు కూడా అయ్యాయి. ఆ కలియపడ్డంలో రాములు ఓ బండ మీద పడ్డాడు. దానివల్ల తలకి రక్తగాయమైంది. ఆ తరువాత గొడవ తగ్గింది. డాక్టర్ దగ్గరికి వెళ్దామని రాములు చెయ్యి పట్టుకొని లేపాడు నారాయణ. కానీ రాములు వినలేదు. నారాయణ చెయ్యి విదిలించుకొని తిరుమలరావు దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు. తిరుమలరావు రాములుని తీసుకొని పోలీస్ స్టేషన్‌కి వచ్చాడు. ఆ గొడవ తిరుమలరావుకి గొప్ప ఆనందాన్ని ఇచ్చింది.

నారాయణ మీద ఎప్పటినుంచో అతనికి కోపం వుంది. నారాయణని కేసులో ఇరికించే అవకాశం దొరికినందుకు అతనికి మహదానందంగా వుంది.

"ఒరేయ్ రామా!" ప్రేమగా రాములుని పిలిచాడు తిరుమలరావు.

"అయ్యా" దూరంగా వున్న రాములు వచ్చి చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

"వాళ్ళిద్దరూ కలిసి నిన్ను చంపడానికి ప్రయత్నం చేసినారని చెప్పాలె. అట్ల చెప్పితేనే వాళ్ళ తిక్క కుదురతది. నీ తెరువు రాకుండా వుంటరు" చెప్పాడు.

'సరే'నని తలవూపాడు రాములు.

"అదిసరే! ఎన్ని పైసలు తెచ్చినవురా" అడిగాడు.

"వెయ్యి తెచ్చిన బాంచను"

"పెద్దకేసు పెట్టాలంటే ఇవ్వి సరిపోవురా. కనీసం రెండువేలన్నా కావాలి. సరే ... అవ్వి ఇటివ్వు" అంటూ రాములు దగ్గరినుంచి వెయ్యి రూపాయిలు తీసుకున్నాడు.


కాస్సేపటికి సర్కిల్ సాబ్ రమ్మంటున్నాడని కానిస్టేబుల్ వాళ్ళని పిలిచాడు. వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళారు. రాములుని వరండాలో వుంచి తిరుమలరావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చాంబర్‌లోకి వెళ్ళాడు.

నమస్కారం చేసి కుర్చీలో కూర్చున్నాడు. ఇన్‌స్పెక్టర్‌తో తిరుమలరావుకి చాలాకాలంగా దోస్తీ వుంది. తిరుమలరావు వచ్చిన తరువాతే వాళ్ళవూరి కేసులు రిజిస్టర్ అవుతాయి. రూపురేఖలు దిద్దుకుంటాయి.

"ఏంటీ సంగతి" అన్నట్టు మర్యాదపూర్వకంగా నవ్వాడు భూపాలరావు.

విషయమంతా చెప్పాడు. నారాయణ తలబిరుసుతనం అతన్ని వంగతీయాల్సిన అవసరమూ చెప్పాడు. రాములు స్టేమెంట్ కూడా చెప్పి తను వ్రాసుకొచ్చిన ఫిర్యాదును ఇన్‌స్పెక్టర్‌కి ఇచ్చాడు. ఫిర్యాదు వెంట రొక్కమూ ఇచ్చాడు. పర్సయ్య, నారాయణల పైన హత్యాప్రయత్నం నేరం రిజిస్టర్ చేయమని ఎస్.ఐ.ని ఆదేశించాడు. వాళ్ళిద్దరినీ తీసుకొని రమ్మని కానిస్టేబుళ్ళని పురమాయించాడు.

సాయంత్రం నాలుగు గంటలకి పర్సయ్యని పట్టుకొచ్చారు పోలీసులు. నారాయణ కరీంనగర్ పోవడంవల్ల దొరకలేదు. పర్సయ్యని చితకబాదారు. కొత్త కొత్త పనిముట్లతో చికిత్సలు చేశారు. ఒళ్ళంతా పుండువుండు అయ్యింది. భూమిపోయినా పర్వాలేదు. కానీ ఎవడితోని కొట్లాడ కూడదనుకున్నాడు. అతని తండ్రి ఆ రోజంతా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగాడు. కానీ ఏమీ చెయ్యలేకపొయ్యాడు. కనీసం కొడుకుని కూడా చూడలేకపోయాడు. తెల్లవారి మోరీల్‌సాబ్ కాళ్ళా గదవా పట్టుకొని కొడుకుని చూశాడు. గుండె పగిలి ఏడ్చాడు. కొడుకుని దక్కించుకోవాలనుకున్నాడు. చివరికి తిరుమలావు కాళ్ళు పట్టుకొని భూపాలరావుకి ఐదువేల రూపాయిలు కట్నం చదివించుకున్నాడు. కేసు కాకుండా చూడమన్నాడు. తన్నులు పడకుండా చూడమన్నాడు. కొడుకుని బయటకు వచ్చేట్టు చూడమన్నాడు. అతని కోరికలు ఏవీ నెరవేరలేదు కానీ మళ్ళీ పర్సయ్యకి తన్నులు పడలేదు. ఇదివరకే అయిన గాయాలు కాస్త మానిన తరువాత మూడురోజులకి కోర్టుకి రిమాండుకు పంపించారు. కోర్టు అతన్ని జ్యూడీషియల్ కస్టడీకి పంపించింది.




నారాయణ ఇంకా వచ్చి పోలీసుల ముందు లొంగిపోలేదు. తిరుమలరావు మళ్ళీ వచ్చి నారాయణ మీద కారాలు మిరియాలు నూరిపోశాడు. భూపాలరావుకి కోపం వచ్చింది.

కానిస్టేబుల్స్‌ను పంపించి నారాయణ తండ్రి మల్లయ్యని పట్టి తెప్పించాడు. మల్లయ్య ముసలి రైతు. అరవై ఏళ్ళుంటాయి. పులిముందు ఆవులా భయం భయంగా ఒదిగి ఇన్‌స్పెక్టర్ ముందు నిల్చున్నాడు.

"ఏంరా! మల్లిగా కొడుకుని ఎక్కడ దాచిపెట్టినవురా?" ప్రశ్నించాడు.

"నేను దాచిపెట్టలేదు దొరా! వాడికి దెబ్బలు తాకి కరీంనగర్ దావఖానాల షరీకయ్యిండు" భయం భయంగా జవాబు చెప్పి కాస్సేపటికి "వాడేం చేసిండు దొరా!" అన్నాడు.

"ఏం చేసిండా! ఏమిరా బాగా అడుగుతున్నవు. వాన్ని చంపే ప్రయత్నం చేసిండుగదా!" జవాబు చెప్పాడు ఇన్‌స్పెక్టర్. కానీ వాడి ప్రశ్న రుచించలేదు.

"వాడేం చెయ్యలేదు దొరా! రాయి మీద పడి రాములే దెబ్బ తాకించుకున్నాడు. అప్పుడు చూసినోళ్ళు కూడా వున్నారు" కొడుకుని రక్షించుకోవడంకోసం ధైర్యంచేసి జవాబు చెప్పాడు మల్లయ్య.

"కథలు చెప్పకురా మల్లిగా! వాడు ఏంచేసిండో, వూళ్ళో ఏమేం చేస్తున్నడో అన్నీ నాకు తెలుసు. వాడిని రేప్పొద్దుగాల ఇక్కడికి తీస్కోని వస్తేనే మంచిది. లేకపోతే వాడెక్కడున్నా పట్టి తెప్పిస్తా. నీ గుండెల్లో నిద్దుర బోతా సమజైందా?" హుంకరించాడు భూపాలరావు.

ఇంకా ఏమైనా మాట్లాడితే కొడతాడేమోనని మల్లయ్యకి భయం వేసింది. ఏమీ జవాబు చెప్పకుండా 'సరే'నని చెప్పి బయటకు నడిచాడు.

ఆరోజు సాయంత్రమే కరీంనగర్ బస్సు ఎక్కాడు మల్లయ్య. చీకట్లు పడుతున్న సమయంలో కొడుకు వున్న దావాఖానకి పోయిండు. కొడుకుని కలిశాడు. ఆ సమయంలో తండ్రిని చూసి ఆశ్చర్యపోయాడు నారాయణ.

"ఏంది నాయన గీయాల్లకు వచ్చినవు" తండ్రి దగ్గరికి వస్తూ ప్రశ్నించాడు.

"ఏం లేదురా వూరికే వచ్చినా" జవాబు చెప్పాడు. తండ్రి సమాధానం సంతృప్తి కలిగించలేదు. తండ్రి ఏదో దాచిపెడ్తున్నాడనిపించింది.

"పర్సయ్య ఎట్లా వున్నాడు నాయన"

"ఏం చెప్పనురా నారాయణా! కుక్కను కొట్టినట్టు పోలీసులు కొట్టినారు. ఐదువేల రూపాయిలు కూడా వాని తండ్రి దగ్గర వసూలు చేసినారు. అయినా కేసు తప్పలేదు. ఇప్పుడు జైల్లో వున్నాడు. వాన్ని బయటకు తీసుకరావడానికి వాళ్ళ నాయన కూడా కరీంనగర్‌కి వచ్చిండు"

"ఐదువేల రూపాయిలు ఎందుకిచ్చిండు నాయన"


"ఎందుకేందిరా! పోరడు తన్నులకి చచ్చిపోతుంటే ఏ తండ్రైనా ఏం చేస్తాడు. చివరికి తిరుమలరావు దొర కాళ్ళు పట్టుకొనే డబ్బులు కట్టిండ్రు"

నారాయణ మనస్సు కుతకుతలాడిపోయింది. పర్సయ్యది తప్పులేదు. రాములుదే తప్పు అయినా రాములు మీద కేసు పెట్టడం, తన్నడం, డబ్బులు వసూలు చెయ్యడం చివరికి తిరుమలరావును పట్టుకొనే డబ్బులు చెల్లించడం. నారాయణకి తల తీసేసినట్టుగా అన్పించింది. కోపం ముంచుకొచ్చింది.

"వాళ్ళ నాయనతో కల్సి వచ్చినవా?" ప్రశ్నించాడు.

"లేదురా! నిన్ను రేపు పొద్దుగాల తీస్కరమ్మని సర్కిల్ సాబ్ జెప్పిండు. తీసుకరాకపోతే నా గుండెలో నిద్దురపోతానని బెదిరించిండు. నిన్ను కూడా ఆ కేసులో తిరుమలరావు ఇరికించిండురా"

తండ్రి మాటలు వినగానే విషయమంతా అర్థమైంది. వూళ్ళో తెల్లగా ఎవరూ కన్పించకూడదు. వాళ్ళు ఆర్థికంగా దిగజారిపొయ్యేదాకా తిరుమలరావుకి నిద్రపట్టదు. నారాయణ మనస్సు పరిపరివిధాల పోయింది. పోలీసుల దగ్గరికి పోతే ఏమవుతుందో అర్థమైంది. తన్నులు పడక తప్పదు. డబ్బులు చెల్లించకా తప్పదు. కేసూ తప్పదు. అందుకని ఉదయం లేచి తన వూరికి తిరిగివచ్చాడు. తనకు తెలిసిన న్యాయవాదిని కలిశాడు. అతనూ నారాయణ అనుకున్నట్టే చెప్పాడు. కోర్టులో సరెండర్ అయితే తన్నుల బాధ, డబ్బులు చెల్లించాల్సిన బాధ వుండదని సలహా ఇచ్చాడు. నారాయణకి ఆ సలహా నచ్చింది. ఆరోజు ఉదయం పదిన్న




రకి కోర్టులో సరెండర్ అయ్యాడు. కోర్టు నారాయణని జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది.

ఈ విషయం తెలిసి ఇన్‌స్పెక్టర్ భూపాలరావుకి మండుకొచ్చింది. నారాయణని, మల్లయ్యని బూటుకాలితో నలిపివెయ్యాలనిపించింది. భూపాలరావుకి కోపం తెప్పించినవాళ్ళని ఎవరినీ వదిలిపెట్టడు. సమయం చూసుకొని వారి అంతుచూస్తాడు. కానీ నారాయణ అంతు చూడాలంటే ఇప్పుడు ఆ అవకాశం లేదు. నారాయణ సంగతి చూడకపోతే అందరూ అట్లాగే సరెండరవుతారు. ఎట్లాగైనా నారాయణ వీపు పగలగొట్టాలి. లేకపోతే తన అధికారానికే ఆటంకం అనుకున్నాడు ఇన్‌స్పెక్టర్ భూపాలరావు. ముసలి లంజాకొడుకు కొడుకుని తీసుకొస్తానని చెప్పి కోర్టులో సరెండర్ చేస్తాడా? వాడి వీపుపగలకొడితే వాడు చచ్చినా చస్తాడు. అందుకని ఆ ఆలోచన మానుకున్నాడు. అందరూ ఇట్లాగే సరెండర్ అవుతే తన రెండవ అంతస్తు ఎప్పుడు పూర్తవుతుంది. ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు. పరిశోధన నిమిత్తం నారాయణని పోలీస్‌కస్టడీకి తీసుకుంటే ... ఆలోచనరాగానే తన తెలివితేటలకు తనకే ముచ్చట వేసింది భూపాలరావుకి.

రైటర్‌ని పిలిచి విషయం చెప్పి పిటీషన్ టైప్ చేసుకొని రమ్మని చెప్పాడు. టైప్‌చేసి తీసుకొని వచ్చిన పిటీషన్ని తీసుకొని జీప్‌లో కోర్టుకి బయల్దేరాడు. కోర్టులో మధ్యాహ్నం పిటీషన్ దాఖలుచేశాడు. ప్రాసిక్యూటర్ వాదనలు విన్న తరువాత, నారాయణని పోలీస్ కస్టడీకి ఇవ్వడంవల్ల ఎలాంటి ఉపయోగం లేదని, కేసులో పరిశోధన కూడా పూర్తి అయిపోయిందని నారాయణని పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి నిరాకరిస్తూ పిటీషన్ని కొట్టివేసింది కోర్టు.

భూపాలరావుకి మళ్ళీ కోపం వచ్చింది. ఈసారి నారాయణపైన కాదు. మెజిస్ట్రేట్ పైన, ఏ.పి.పీ పైన, న్యాయవ్యవస్థపైన. పోలీసులకి ఉపయోగపడని న్యాయవ్యవస్థ ఎందుకూ? పోలీసులే దొంగలైనట్టు చూస్తాడు ఈ మేజిస్ట్రేట్. తన ప్రతాపం ఎప్పుడన్నా చూపించాలి అనుకున్నాడు ఇన్‌స్పెక్టర్ భూపాలరావు. నిరుత్సాహంగా స్టేషన్‌కి తిరుగుముఖం పట్టాడు.

వారం రోజులు గడిచిపొయ్యాయి. జైల్లో వున్న నారాయణ ఆరోగ్యం క్షీణించింది. డాక్టర్ వచ్చి మందులు ఇచ్చాడు. కానీ అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి లేదు. బెయిల్ ఇంకా రాలేదు. అందుకని జైలు నుంచి మేజిస్ట్రేట్‌కి ఓ దరఖాస్తు పంపుకున్నాడు. తన ఆరోగ్యం బాగా క్షీణించిపోయిందని తనని హాస్పిటల్లో చేర్పించి వైద్య సదుపాయాలు అందచేయాలని పిటీషన్‌లో పేర్కొన్నాడు. కోర్టు అతని పిటీషన్ని పరిశీలించి అతనికి తగు పోలీస్ రక్షణలో హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి వైద్య సదుపాయాలు కల్పించాలని జైలు సూపర్నెంట్‌ను కోర్టు ఆదేశించింది.

ఆ ఉత్తర్వులు అందగానే జైలు సూపర్నెంట్ అలర్టయ్యాడు. వైద్య సదుపాయాలు లేక రాజన్‌పిళ్ళై మరణం గుర్తొచ్చింది. నారాయణకి ఏమన్నా అయితే తనమీదికి వస్తుందని అతన్ని త్వరగా హాస్పటల్‌కు పంపించాలనుకున్నాడు. అతని దగ్గర వున్న ఐదుగురు కానిస్టేబుళ్ళలో ఇద్దరు లీవుమీద వున్నారు. ఒకరు ఆఫ్‌లో వున్నారు. ఇద్దరు డ్యూటీలో వున్నారు. అందుకని నారాయణ మీద కేసు పెట్టిన పోలీసులకి ఎస్కార్టు ఏర్పాటుచేయమని రిక్విజిషన్ పంపించాడు. అప్పుడు స్టేషన్లో వున్న భూపాలరావు ఆ రిక్విజిషన్ని చూసి పరమానందభరితుడైపోయాడు. కానిస్టేబుళ్ళని ఇద్దరినీ పిలిచి "జైలుకెళ్ళి ఆ నారాయణని ఇక్కడికి తీసుకొని రండి. వాడి సంగతి చూడాలి" ఆదేశించాడు.

కానిస్టేబుళ్ళు ఇద్దరూ జీపు తీసుకొని జైలుకెళ్ళారు. హాస్పటల్‌కు తీసుకెళ్ళడానికి నారాయణని బయటకి తీసుకొని వచ్చారు. జీపులో నారాయణకి తెలియకుండా స్టేషన్‌కి తీసుక వచ్చారు. నారాయణ ఆశ్చర్యపోయాడు. భయం కూడా వేసింది. అతన్ని పోలీస్‌స్టేషన్‌లోనికి తీసుకొనివెళ్ళారు. ఇన్‌స్పెక్టర్ భూపాలరావు నారాయణకోసం అవురావురుమంటూ ఎదురుచూస్తున్నాడు. భూపాలరావుని చూడగానే నారాయణకి ముచ్చెమటలు పోశాయి.

"ఏమిరా నారిగా మమ్మల్ని తప్పించుకొని ఎక్కడికిబోతావురా లంజాకొడుకా! మా దగ్గర సరెండర్ కాకుండా కోర్టులో సరెండర్ అవుతావా! ఇప్పుడు నిన్ను ఎవడు రక్షిస్తాడో చూస్తాను" అన్నాడు.

నారాయణకి ఏం జవాబు చెప్పాలో తోచలేదు. పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగానే తనని ఇక్కడికి తీసుకొని వచ్చారని అనుకున్నాడు.

"నాకు ఆరోగ్యం బాగాలేదు సార్! నన్ను హాస్పిటల్‌కి పంపించండి. కోర్టు ఉత్తర్వులు కూడా వున్నాయి" ధైర్యం చేసుకొని చెప్పాడు.

"నీ ఆరోగ్యం బాగలేదురా! అందుకే నిన్ను మంచిగ చేద్దామనే ఇక్కడికి తీసుకొని వచ్చాం. మళ్ళీ నీలాగా కోర్టులో ఎవడూ సరెండర్ కాకుండా వుండటానికే నిన్ను తీసుకొచ్చాం" నారాయణ చెంపమీద ఒక్కపెట్టు పెట్టాడు ఇన్‌స్పెక్టర్.

జ్వరంతో వున్న నారాయణ తూలి కిందపడ్డాడు.

"కోర్టులు, ఉత్తర్వులు అని మాకే చట్టం చెబుతావా?" అంటూ రెండు తన్నులు బూటుకాలితో తన్నాడు.

"అవ్వా అయ్యా" అంటూ మూలిగాడు నారాయణ.

"వీడికి ఇది సరిపోదురా! లోపలికి తీసుకెళ్ళి నాలుగు అంటించండి" కానిస్టేబుళ్ళని ఆదేశించాడు.

యమకింకరుల్లా అతన్ని లాక్కుపోయారు పోలీసులు. నారాయణ్ని జైలు నుంచి దవాఖానాకి కాకుండా పోలీస్‌స్టేషన్‌కి తీసుకొనిపోయినారన్న సంగతి అతని తండ్రి మల్లయ్యకి తెలిసి పరుగుపరుగునా స్టేషన్‌కి వచ్చాడు. వచ్చి భూపాలరావు కాళ్ళమీద పడ్డాడు. తప్పైపోయింది క్షమించమని వేడుకున్నాడు.

"లంజాకొడుకా! కొడుకుని తీసుకొని వస్తానని చెప్పి కోర్టులో సరెండర్ చేయిస్తావా? నీకెంత హిమాకత్‌రా! మా దగ్గరికి తీసుకవస్తే మేమే కోర్టుకి పంపించే వాళ్ళం కదా! బాగా కావరమెక్కిందిరా నీకు" అంటూ బూటుకాళ్ళతోని ఒక్క తన్ను తన్నాడు.

ఆ తన్నుకు దూరంగా పడిపోయాడు మల్లయ్య. లేచి మళ్ళీ సర్కిల్ సాబ్ కాళ్ళ మీద పడబోయాడు. సర్కిల్ సాబ్ ఆదేశం మేరకు కానిస్టేబుళ్ళు అతన్ని లాక్కెళ్ళి చెట్టుకింద పడేశారు.

ఏం చెయ్యాలో తోచలేదు మల్లయ్యకి. కొడుకుని రక్షించుకోవడం మినహా అతనికి ఏమీ కన్పించడంలేదు. మెల్లిగా కుంటుకుంటూ బయటకు వచ్చి తిరుమలరావు ఇంటికి వెళ్ళి అతని కాళ్ళమీద పడ్డాడు. భోరున విలపించాడు. అతను తప్ప తనకు గతి ఎవరూ లేరని చెప్పాడు. తిరుమలరావు అతన్ని ఓదార్చాడు. తిరుమలరావు సలహా మీద భార్య బంగారు గంటీలు === కుదువపెట్టి ఐదువేలు తెచ్చి దొర చేతిలో పోసిండు. దొరతోబాటు స్టేషన్‌కి వచ్చాడు. దొర వెళ్ళి సర్కిల్ సాబ్‌తో మాట్లాడాడు. కాస్సేపటికి నారాయణని బయటకి తీసుకవచ్చారు. హాస్పటల్ వైపు తీసుకవెళ్ళారు పోలీసులు. రెక్కలు విరిగిన పక్షిలా నాగాయణ పోలీసుల వెంట బయల్దేరాడు. తన రెండో అంతస్తులోని మూడో కిటికీ రెక్కలు వసూలుచేసినందుకు సంతోషపడ్డాడు భూపాలరావు.

"కోర్టుకి వెళ్ళి ఏమి సాధించినావురా కొడకా తన్నులూ తప్పకపోయే, డబ్బులు తప్పకపోయే, కేసు పెట్టడం ఆగకపోయే" అనుకుంటూ కన్నీళ్ళతో కొడుకువెంట బయల్దేరాడు మల్లయ్య.